సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 25 । మే । 2023



చీనీ టన్ను రూ.36,500
అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36,500 ప్రకారం పలికాయి. మార్కెట్‌కు 641 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



ఐదేళ్లు గాడిదలు కాశావా బాబూ..
అధికారంలో ఉన్నన్నాళ్లూ రాజధాని ప్రాంతం లోని పేదలకు మేలు చేయకుండా గాడిదలు కాశావా చంద్రబాబూ...అని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించారు. 8లో

గరిష్టం/కనిష్టం
41.1°/23.4°
జిల్లాలో బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత అధికంగానే ఉంది. ఆకాశం మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

భారత అండర్–23 మహిళా క్రికెట్ జట్టుకు అనూష ఎంపిక


అనూష

అనంతపురం: భారత అండర్–23 మహిళా క్రికెట్ జట్టుకు జిల్లాకు చెందిన బి.అనూష ఎంపికై ంది. ఈమె స్వగ్రామం నార్పల మండలం బండ్లపల్లి. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి క్రికెట్‌లో అంచెలంచెలుగా ఎదుగుతోంది. ఎడమ చేతి వాటం బౌలింగ్, బ్యాటింగ్‌లో రాణిస్తోంది. హాంకాంగ్‌లో జరిగే అండర్–23 అంతర్జాతీయ మహిళా క్రికెట్ టోర్నీలో టీమిండియా తరఫున ప్రాతినిథ్యం వహించనుంది. ఆర్డీటీ స్పోర్ట్స్ అకాడమీకి చెందిన అనూష జాతీయ జట్టుకు ఎంపిక కావడం గర్వకారణమని జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఓ ప్రకటనలో పేర్కొంది.

రెస్టారెంట్లకు లైసెన్స్ తప్పనిసరి


జానకంపల్లి వద్ద గల ఓ రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న రామచంద్రప్ప

ప్రశాంతి నిలయం: రెస్టారెంట్లు, హోటళ్ల నిర్వాహకులు, పండ్ల వ్యాపారులు తప్పని సరిగా ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ తీసుకోవాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రామచంద్రప్ప హెచ్చరించారు. బుధవారం ఆయన సిబ్బందితో కలిసి బుక్కపట్నం మండలం జానకంపల్లి సమీపంలోని ఎస్ ఎస్ గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్, బుక్కపట్నం పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న మదీనా చికెన్ కబాబ్ సెంటర్, జానకంపల్లి వద్ద గల ఈశ్వర్ రెస్టారెంట్, అక్షితా రెస్టారెంట్, చిత్రావతి బైపాస్ రోడ్డులోని గిరిసాయి ఫ్రూట్ షాప్‌లను తనిఖీ చేశారు. ఏ ఒక్కదానికీ ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేకపోవడంతో వారం గడువు ఇచ్చి లైసెన్స్‌లు తీసుకోవాలని సూచించారు. లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా ఆహార విక్రయాలకు సంబంధించిన వ్యాపారం చేసే వారంతా తప్పని సరిగా ఫుడ్ సేఫ్టీ సర్టిఫికెట్ పొందాలని సూచించారు.

డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు: హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీపై మూడేళ్ల డిప్లొమా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు జిల్లా పవర్‌లూమ్స్ అధికారి రమేష్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రానికి సంబంధించి తిరుపతి జిల్లా శ్రీప్రగఢ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీలో 53 సీట్లు, ఆంధ్రప్రదేశ్ అభ్యర్థులకు తమిళనాడులోని సేలంలో 12, కర్ణాటకలోని గదగ్‌లో 4 సీట్లు కేటాయించారు. పదో తరగతి ఉత్తీర్ణత, బీసీ, జనరల్ కేటగిరికి సంబంధించి 2023 జూలై 2 నాటికి 15 నుంచి 23 ఏళ్లలోపు వారు అర్హులు. ఎస్సీ, ఎస్టీలకు రెండేళ్ల సడలింపు ఉంటుంది. ఆసక్తి గల వారు జూన్ 26లోపు దరఖాస్తులు అందజేయాలి. సమాచారం కోసం www.iihtvgr.com వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.

విద్యార్థికి వరం విద్యాదీవెన

- నిరుపేద విద్యార్థుల ఉజ్వల భవితకు సీఎం కృషి
- 'జగనన్న విద్యాదీవెన' కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు
- జిల్లాలో 31,675 మంది తల్లుల ఖాతాల్లో రూ.25.33 కోట్లు జమ


విద్యార్థులకు విద్యాదీవెన మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: నిరుపేద కుటుంబాల్లోని విద్యార్థుల ఉన్నత భవితకు 'విద్యాదీవెన' పథకం వరంలా మారిందని కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఏ ఒక్క విద్యార్థీ ఉన్నత చదువులకు దూరం కాకూడదన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు అమలు చేస్తూ పేదల ఇంట విద్యాకాంతులను వెలిగిస్తున్నారన్నారు. సీఎం జగన్ బుధవారం తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో నిర్వహించిన సభ నుంచి విద్యాదీవెన కింద ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని కంప్యూటర్ బటన్ నొక్కి విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేశారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డ్ చైర్మన్ అవుటాల రమణారెడ్డి, పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, పుట్టపర్తి ఎంపీపీ ఏవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రూ.25.33 కోట్ల మెగా చెక్కు అందజేశారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ ఎంతో మహోన్నత ఆశయంతో విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించారన్నారు. నాలుగేళ్ల నుంచి క్రమం తప్పకుండా నిధులు జమ చేస్తూ నిరుపేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నారన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు.

తల్లుల ఖాతాల్లో నగదు జమ..
జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, మెడిసిన్ చదువుతున్న 31,675 మంది విద్యార్థులు జగనన్న విద్యాదీవెనకు అర్హత సాధించారు. దీంతో వారి తల్లుల ఖాతాల్లో రూ.25,33,29,978 నగదు జమ అయినట్లు కలెక్టర్ వివరించారు. ఇందులో ఈబీసీ కింద 3,768 మందికి రూ.4.21 కోట్లు, ఎస్సీ సంక్షేమం కింద 141 మందికి రూ.21.73 లక్షలు, ఎస్టీ సంక్షేమం కింద 2,141 మందికి రూ.1.58 కోట్లు, బీసీ సంక్షేమం కింద 19,295 మందికి రూ.14.66 కోట్లు, కాపు సంక్షేమం కింద 2,872 మందికి రూ.2.36 కోట్లు, ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన 3,429 మందికి రూ.2.25 కోట్లు, క్రిస్టియన్ మైనార్టీ వర్గానికి చెందిన 29 మందికి రూ.2.44 లక్షల మేర లబ్ధి కలిగిందని వివరించారు.

రాష్ట్రంలో జనరంజక పాలన..
వైఎస్ జగన్ సీఎం అయ్యాక రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతోందని, ప్రతి పథకం అర్హతే ఆధారంగా అర్హులకు అందుతోందని జిల్లా అగ్రి బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి అన్నారు. అర్హతే ప్రామాణికంగా రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదేనన్నారు. గత టీడీపీ పాలనలో ఏ పథకం అమలు చేసినా పచ్చచొక్కాలకే అందేదన్నారు. అందుకే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలాజ్యోతి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్లు మధులత, శవాని శంకరి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది



జగనన్న విద్యాదీవెన పథకానికి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. మాది పూర్తి వ్యవసాయ కుటుంబం. మా నాన్న వ్యవసాయం చేస్తూ నన్ను చదివిస్తున్నారు. సకాలంలో పూర్తి ఫీజు రీయంబర్స్‌మెంట్ చేయడంతో చదువుకు ఇబ్బంది లేకుండా పోయింది. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.
– నవ్యశ్రీ, గాండ్లపెంట మండలం

ప్రోత్సాహం మరువలేం



మాలాంటి పేద విద్యార్థులకు జగనన్న అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిది. గతంలో ఏ ప్రభుత్వమూ ఇలాంటి పథకాలు అమలు చేయలేదు. నాకు 'విద్యా దీవెన'తో లబ్ధి కలగగా, మా కుటుంబానికి వివిధ పథకాల ద్వారా మేలు జరుగుతోంది.
– రాము, బ్రాహ్మణపల్లి, పుట్టపర్తి మండలం

పేద విద్యార్థులకు ఎంతో మేలు



జగనన్న విద్యాదీవెన పథకం నాలాంటి పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తోంది. నాకు గత ఏడాది, తాజాగా ఇప్పుడు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అయ్యింది. దీంతో మా చదువులకు ఎలాంటి ఇబ్బందులు కలగడం లేదు. మరింతకాలం జగనన్న సీఎంగా ఉంటే నాలాంటి వారెందరికో మేలు జరుగుతుంది. – సునీత, డైట్ కళాశాల, బుక్కపట్నం

29 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

అనంతపురం: పాలిసెట్–2023లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఈ నెల 29 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (అనంతపురం) ప్రిన్సిపాల్ సి.జయచంద్రా రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం జిల్లాలోని అనంతపురం, కళ్యాణదుర్గం, తాడిపత్రి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలతో పాటు శ్రీ సత్యసాయి జిల్లాలోని హిందూపురం మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జూన్ ఐదో తేదీ వరకు కౌన్సెలింగ్ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి జూన్ ఒకటో తేదీలోపు ఏపీ పాలిసెట్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని సూచించారు. కౌన్సెలింగుకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు.

ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ ఇలా..

తేదీ	ర్యాంకు నుంచి	వరకు
మే 29	01	12,000
మే 30	12,001	28,000
మే 31	28,001	43,000
జూన్ 01	43,001	58,000
జూన్ 02	58,001	74,000
జూన్ 03	74,001	91,000
జూన్ 04	91,001	1,08,000
జూన్ 05	1,08,001	ఆపైన

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

రాప్తాడురూరల్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలు జరిగాయి. ఉదయం ఉమ్మడి జిల్లాలోని 77 కేంద్రాల్లో జరిగిన మొదటి సంవత్సరం జనరల్, ఒకేషనల్ పరీక్షలకు 3,226 మంది విద్యార్థులకు గాను 3,062 మంది హాజరయ్యారు. 164 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 77 కేంద్రాల్లో జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1,311 మంది విద్యార్థులకు గాను 1,232 మంది హాజరయ్యారు. 79 మంది గైర్హాజరయ్యారు.

టీచర్ల బదిలీల కోలాహలం

- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
- రేపటితో ముగియనున్న దరఖాస్తు గడువు
- ఉమ్మడి 'అనంత' జిల్లా ప్రాతిపదికగా బదిలీలు


జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం

కదిరి: ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రాతిపదికగా ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. బుధవారం నుంచి టీచర్లు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ నెల 26వ తేదీతో బదిలీల దరఖాస్తుకు గడువు ముగియనుంది. విద్యా సంవత్సరానికి ఎలాంటి ఆటంకం కలగకుండా బదిలీల షెడ్యూల్ విడులైంది. 2023–24 విద్యాసంవత్సరంలో స్కూళ్లు తెరిచే నాటికి బదిలీల ప్రక్రియ ముగిసే విధంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 5 వేల మంది దాకా ఉపాధ్యాయులు బదిలీల ద్వారా కొత్త పాఠశాలలకు వెళ్లనున్నారు.

పారదర్శకంగా బదిలీలు..
గతానికి భిన్నంగా, బదిలీల్లో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం ఆన్‌లైన్ విధానం ద్వారా బదిలీలు జరిపేందుకు సిద్ధమైంది. ఉపాధ్యాయులు ఇంట్లో నుండే దరఖాస్తు చేసుకోవడంతో పాటు బదిలీల ఉత్తర్వులు కూడా ఆన్‌లైన్ ద్వారానే అందుకోవచ్చు. ఒకే పాఠశాలలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న హెచ్‌ఎంలు, 8 ఏళ్లు పూర్తి చేసుకున్న ఎస్‌జీ టీచర్లు ఇప్పుడు తప్పని సరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. అయితే 2025 మే 31వ తేదీ లేదా అంతకు ముందు పదవీ విరమణ చేయనున్న ఉపాధ్యాయులకు ఇది వర్తించదు. వారి అభ్యర్థన మేరకు బదిలీ ఉంటుంది. పట్టణానికి దగ్గరలో ఉన్న పాఠశాలలను కేటగిరీ 1–2, మారుమూల ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలను కేటగిరి 3–4లుగా గుర్తించారు. దీని ఆధారంగానే బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు పాయింట్లు కేటాయిస్తారు. అలాగే సీనియారిటీకి కూడా తగిన పాయింట్లు ఉంటాయి.

నోడల్ అధికారిగా 'అనంత' డీఈఓ..
ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన టీచర్ల బదిలీలు జరుగుతున్నందున అనంతపురం జిల్లా డీఈఓ ఎం.సాయిరాం నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. కేడర్ల ఆధారంగా ఉమ్మడి జిల్లాలో ఉన్న ఖాళీల వివరాలను విద్యాశాఖ అధికారులు సేకరిస్తున్నారు. ఆయా మండల విద్యాశాఖాధికారుల ద్వారా ఉప విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరుగుతోంది.

బదిలీల షెడ్యూల్ ఇలా..
- ఈ నెల 26 వరకూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ
- 25 నుండి 27 వరకూ సర్టిఫికెట్ల పరిశీలన
- 28, 29 తేదీల్లో సీనియారిటీ జాబితా ప్రకటన
- 30న సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ
- మే 31, జూన్ 1న అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం
- జూన్ 2, 3 తేదీల్లో తుది సీనియారిటీ జాబితా వెల్లడి
- 4న కేడర్ల వారీగా ఖాళీల ప్రకటన
- 5, 6 తేదీల్లో హెచ్‌ఎంలు, 5 నుంచి 7 వరకూ స్కూల్ అసిస్టెంట్లు, 5 నుంచి 8 వరకూ ఎస్‌జీ టీచర్లకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునేందుకు అవకాశం
- 9న హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, 9 నుంచి 11 వరకూ ఎస్‌జీ టీచర్లకు బదిలీల ఉత్తర్వులు ఆన్‌లైన్‌లో ఉంచనున్నారు.

తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు తప్పవు
ఉపాధ్యాయ బదిలీల దరఖాస్తుల్లో ఎవరైనా తప్పుడు సమాచారంతో ఎక్కువ పాయింట్లు సాధించాలని చూస్తే చర్యలు తప్పవు. పీహెచ్‌కు సంబంధించి తాజా ధ్రువీకరణ పత్రం జత చేయాలి. అలాగే అవివాహితులు లేదా స్పౌజ్ కోటాకు దరఖాస్తు చేసే వారి వివరాలూ క్షుణ్ణంగా పరిశీలిస్తాం. తప్పుడు సమాచారం ఇచ్చిన వారిపై క్రిమినల్ చర్యలు ఉంటాయి.
– మీనాక్షి, జిల్లా విద్యాశాఖ అధికారిణి

పాఠశాలలు తెరిచినరోజే విద్యాకానుక

- కలెక్టర్ అరుణ్‌బాబు


పరిగి: విద్యాకానుక కిట్ల గురించి ఎంఈఓ లక్ష్మీదేవిని ఆరా తీస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పరిగి: పాఠశాలలు పునఃప్రారంభమయ్యే జూన్ 12వ తేదీనే ప్రతి విద్యార్థికీ 'జగనన్న విద్యాకానుక' కిట్లు అందిస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఇందుకోసం ఈనెల 31వ తేదీలోపే ప్రతి పాఠశాలకు విద్యాకానుక సామగ్రిని చేరుస్తామన్నారు. బుధవారం ఆయన పరిగి మండలంలో పర్యటించారు. తొలుత పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన, పాఠశాలలో నిల్వ చేసిన జగనన్న విద్యాకానుక వస్తువులను పరిశీలించారు. ఇప్పటికే మండలానికి చేరిన జగనన్న 'విద్యా కానుక' కిట్ల సంఖ్య, ఇంకా సరఫరా కావాల్సిన కిట్ల గురించి ఎంఈఓ లక్ష్మీదేవిని ఆరా తీశారు. ఇండెంట్ మేరకు కిట్లు సరఫరా అయ్యేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యాకానుక పంపిణీకి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని మండల విద్యాశాఖ అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ మండలంలోని కాలువపల్లిలో ఉన్న నిషా గార్మెంట్స్ వస్త్ర పరిశ్రమకు వెళ్లారు. మహిళాకార్మికులతో మాట్లాడారు. రోజుకు కూలీ ఎంత గిట్టుబాటు అవుతోంది..? ఎంత మంది పనిచేస్తున్నారు... యాజమాన్యం వల్ల ఏవైనా సమస్యలున్నాయా అని ఆరా తీశారు. మహిళల భద్రతకు చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి ఆదేశాలిచ్చారు. కలెక్టర్ వెంట పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఎంపీడీఓ సరస్వతి, ఎంఈఓ లక్ష్మీదేవి, డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహం తదితరులు ఉన్నారు.

పర్యావరణానికి ఇబ్బంది కలగొద్దు
హిందూపురం: పరిశ్రమల వ్యర్థాల వల్ల పర్యావరణానికి ఇబ్బంది కలగకుండా చూడాలని కలెక్టర్ అరుణ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన సబ్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి తూమకుంట పారిశ్రామికవాడలోని పవర్‌గేర్ లిమిటెడ్, ఏపీ ఇంజినీరింగ్ వర్క్స్ తదితర పరిశ్రమలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిశ్రమల్లో ఉత్పత్తయ్యే వస్తువులు, ముడిసరుకు దిగుమతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్యం, మురుగునీటి కారణంగా తలెత్తుతున్న ఇబ్బందులను పరిశీలించారు. మరోసారి తనిఖీలకు వస్తానని, అప్పుడు ఎలక్ట్రికల్, ఫైర్ అధికారులతో కలిసి పరిశ్రమలను తనిఖీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కేశవులు, పర్యావరణ శాఖ ఇంజినీర్ శంకర్‌రావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాద్, సీఐ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు మెరుగైన సేవలు


అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బసిరెడ్డి

అనంతపురం సెంట్రల్: వాహనదారులకు మెరుగైన సేవలందించాలని జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (రీజనల్) బసిరెడ్డి రవాణా శాఖ అధికారులకు సూచించారు. బుధవారం అనంతపురం వచ్చిన ఆయన ఉప రవాణా కమిషనర్ శివరామప్రసాద్‌తో కలిసి రవాణా శాఖ లక్ష్యాలు, అధికారుల పని తీరుపై సమీక్షించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు పన్నులు వసూలు చేయాలని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ తప్పించుకొని తిరుగుతున్న వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని తెలిపారు. రవాణాశాఖ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు క్విక్ అండ్‌గుడ్ సర్వీస్ అందించాలని, అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్టీఓ సురేష్‌నాయుడు, ఎంవీఐలు రమణారెడ్డి, అతికానాజ్, సునీత, శ్రీనివాసులు, ఏఎంవీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధితో భూగర్భజలాల వృద్ధి

- డ్వామా పీడీ రామాంజనేయులు


చెరువులో పూడికతీత పనులు పరిశీలిస్తున్న రామాంజనేయులు

రొళ్ల: చెరువుల్లో పూడికతీత వల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరిగి భూగర్భ జలాలు పెంపొందుతాయని డ్వామా పీడీ రామాంజనేయులు అన్నారు. బుధవారం ఆయన రొళ్ల మండలం కొడగార్లగుట్ట కాలనీ సమీపంలోని నాయకనకట్టలో 'అమృత్ సరోవర్' కింద చేపట్టిన పూడిక తీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూడికతీత పనులు వేగవంతం చేయాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. కంప చెట్లను పూర్తిగా తొలగించాలన్నారు. పని ప్రాంతంలో కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఆయన వెంట మడకశిర ఏపీడీ జయసింహ, ఎంపీడీఓ రామారావు, సీఎల్ఆర్సీ కోర్సు డైరెక్టర్ లక్ష్మీనారాయణ, ఏపీఓ నాగరాజు తదితరులు ఉన్నారు.

'నాడు–నేడు' పనులు వేగవంతం కావాలి


'నాడు–నేడు' పనులపై అధికారులతో సమీక్షిస్తున్న జేసీ చేతన్

- జూన్ 12లోపు పనులన్నీ పూర్తి చేయాలి
- అధికారులకు జేసీ చేతన్ ఆదేశం

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మనబడి నాడు–నేడు' పనులను వేగవంతం చేసి జూన్ 12వ తేదీలోపు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ చేతన్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో 'మనబడి నాడు–నేడు' పనుల పురోగతిపై పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, సమగ్రశిక్ష తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ చేతన్ మాట్లాడుతూ, 'నాడు – నేడు' కింద చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలన్నీ సకాలంలో పూర్తి చేయాలన్నారు. సిమెంటు కొరత లేకుండా ఆయా మండలాలకు సరఫరా చేస్తామన్నారు. పనుల నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. ఇంజినీరింగ్ అధికారులు పాఠశాలల సుందరీకరణ, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లాలో 740 నూతన మరుగుదొడ్లు మంజూరు కాగా, 64 మాత్రం పూర్తయ్యాయన్నారు. చిన్న చిన్న మరమ్మతు పనులన్నీ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. తరగతి గదులు, మరుగుదొడ్లకు సంబంధించి 1,402 పనులు మంజూరు కాగా, 176 పూర్తయ్యాయన్నారు. 477 వంట గదులు మంజూరు కాగా, 70 పూర్తయ్యాయన్నారు. విద్యుదీకరణ పనులు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్ల ఏర్పాటుకు సంబంధించి 757 పనులుకు గాను 78 పూర్తయ్యాయన్నారు. పెండింగ్ పనులన్నీ జూన్ 12వ తేదీనాటికి పూర్తి కావాలన్నారు. ప్రతి ప్రధానోపాధ్యాయుడు పాఠశాల సంసిద్ధతా నివేదికలో 'నాడు– నేడు' పనుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఆయా ఫీల్డ్ ఇంజనీర్లు ఎలక్ట్రికల్ వస్తు సామగ్రి సరఫరాకు ఇండెంట్లు తమ లాగిన్‌లో నమోదు చేసి నిర్ణీత సమయంలో పూర్తయ్యేందుకు కృషి చేయాలన్నారు. జోళసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పనులపై జేసీ చేతన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని పీఆర్ ఏఈని ఆదేశించారు. కార్యక్రమంలో డీవైఈఓ రంగస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్, పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ వెంకటరమణ, డీఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి
జిల్లాలో వివిధ జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లతో సమావేశమయ్యారు. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, కొడికొండ చెక్‌పోస్ట్–హిందూపురం రహదారి, ఎన్‌హెచ్ 44, ఎన్‌హెచ్ 342తో పాటు ఇతర రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణ ఎంత వరకూ వచ్చింది, ఏఏ మండలాల్లో పెండింగ్‌లో ఉందంటూ ఆరా తీశారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి, కదిరి ఆర్డీఓలు భాగ్యరేఖ, రాఘవేంద్ర, సూపరింటెండెంట్ బాలాజీ, నేషనల్ హైవే అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.


క్లుప్తంగా

మద్యం మత్తులో లారీ డ్రైవర్ వీరంగం

తాడిపత్రి: మద్యం మత్తులో ఓ లారీ డ్రైవర్ బుధవారం తాడిపత్రిలో వీరంగం సృష్టించాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బళ్లారి నుంచి నెల్లూరుకు ఐరన్ ఓర్‌ను తరలిస్తున్న లారీ డ్రైవర్ విరూపాక్షి మద్యం మత్తులో ఐశ్వర్య విల్లాస్ వద్ద ఒక్కసారిగా ఎడమ వైపు నుంచి కుడివైపు రోడ్డులోకి దూసుకెళ్లాడు. ఆ సమయంలో రహదారి పక్కనే ఉన్న టిఫెన్ బండి వద్ద దాదాపు 13 మంది వరకు ఉన్నారు. వారి పక్కనుంచే లారీ దూసుకెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగిపోయింది. విద్యుత్ లైన్లు తెగిపడ్డాయి. ఆ పక్కనే ఉన్న స్కూటీ వాహనం ధ్వంసమైంది. సమాచారం అందుకున్న తాడిపత్రి రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

‘అనంత’ త్యాగధనుడు కల్లూరు

సందర్భం:
నేడు కల్లూరు సుబ్బారావు జయంతి



అనంతపురం కల్చరల్: కొందరు వ్యక్తులు గొప్పవాళ్లుగా జన్మిస్తారు. మరికొందరికి లోకం గొప్పతనం ఆపాదిస్తుంది. చాలా కొద్ది మంది మాత్రమే తమదైన వ్యక్తిత్వంతో గొప్పవారవుతారు. ఈ కోవకు చెందిన వారే కల్లూరు సుబ్బారావు. అనంత త్యాగధనుడిగా ఖ్యాతిగాంచిన ఆయన జయంతిని గురువారం ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా పలువురు సాహితీ వేత్తలు, కళాకారులను ‘కల్లూరు సుబ్బారావు స్మారక అవార్డు’తో సత్కరించనున్నారు.

రాయలసీమ పితామహుడిగా...

హిందూపురం సమీపంలోని కల్లూరు గ్రామంలో 1897, మే 25న జన్మించిన కల్లూరు సుబ్బారావు 1913లో దివ్యజ్ఞాన సమాజం వ్యవస్థాపకులు అనిబీసెంట్ ప్రసంగాలతో ప్రభావితమై జాతీయోద్యమంలో చేరారు. లక్షాధికారుల ఇంట పుట్టినా పేద వారంటే ఎనలేని ప్రేమ. తన దగ్గరున్నదంతా పేదలకు ఇచ్చేశారు. స్వాతంత్రోద్యమంలో జిల్లాలో శిక్ష పొందిన మొట్టమొదటి రాజకీయ ఖైదీ ఆయనే. 1921, సెప్టెంబర్ 28న శిక్షా కాలం పూర్తికాగానే బళ్లారి సభలో గాంధీజీతో కలసి మళ్లీ ఉద్యమంలో పాల్గొన్నారు. 1928, నవంబర్‌లో నంద్యాలలో జరిగిన సభలో దత్తమండలాలకు రాయలసీమగా నామకరణం చేసిన వారిలో కల్లూరు సుబ్బారావు ప్రముఖులు. 1937లో రాయలసీమ ప్రాంతాలు నష్టపోకుండా ‘శ్రీబాగ్ ఒడంబడిక’పై సంతకం చేశారు. అప్పటి రాష్ట్రపతి బాబూరాజేంద్రప్రసాద్‌కు నచ్చ చెప్పి పెన్నార్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. అనంతపురంలో ఇంజనీరింగ్ కళాశాల స్థాపన, టవర్‌క్లాక్ నిర్మాణంలో ఆయన కృషి మరువలేనిది. లలితకళల పట్ల అభిమానంతో అనంతపురం నడిబొడ్డున ఉన్న విలువైన తన సొంత స్థలాన్ని ‘లలిత కళాపరిషత్’కు దానమిచ్చారు. ఆయన నిరుపమాన సేవలను గుర్తించిన ప్రభుత్వం 1967లో ‘పద్మశ్రీ’ అవార్డుతో సత్కరించింది. జిల్లాలో అభ్యుదయ కార్యక్రమాలకు నాంది పలికిన కల్లూరు సుబ్బారావు 1973, డిసెంబర్ 20న శాశ్వతంగా కన్నుమూశారు. కానీ, ఆయన నాటిన ఆదర్శ బీజాలు అజరామరంగా నిలిచిపోయాయి.

నేడు ఎల్కేపీలో పురస్కార ప్రదాన సభ..

కల్లూరు సుబ్బారావు పేరిట ఈ ఏడాది గతంలో కన్న భిన్నంగా వివిధ ప్రాంతాలకు చెందిన వారికి గురువారం సాయంత్రం స్మారక అవార్డులను అందజేయనున్నారు. ఇందుకు ఎల్కేపీ వేదిక కానుంది. అవార్డులు అందుకునే వారిలో అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన సీనియర్ రచయిత టీఎస్ఏ కృష్ణమూర్తి, శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన సీనియర్ సాహితీవేత్త కల్లూరు రాఘవేంద్రరావు, అనంతకు చెందిన చిత్రకారుడు, కవి ఆర్వీ ప్రసాద్ ఉన్నారు.

ఐదేళ్లు గాడిదలు కాశావా బాబూ..



చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం (చిత్రంలో) ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ప్రశాంతి నిలయం: రాష్ట్రం విడిపోయిన తర్వాత 2014లో అధికారం చేపట్టి ఐదేళ్ల రాజధాని ప్రాంతంలో పేదలకు మేలు చేయకుండా గాడిదలు కాశావా? అంటూ చంద్రబాబును పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రశ్నించారు. రాజధాని అమరావతి పేరుతో 35 వేల ఎకరాల పేదల భూములను కారుచౌకగా కొట్టేసి తన కోటరీలోని గద్దలకు పంచాలని చూసిన చంద్రబాబు.. నేడు సీఎం వైఎస్ జగన్ అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తుంటే జీర్ణించుకోలేకపోతున్నాడని మండిపడ్డారు. అమరావతిలో 50 వేల పేద కుటుంబాలకు సెంటు చొప్పున నివేశన స్థలాలు పంపిణీ చేస్తుంటే ఆ స్థలం శవాన్ని పూడ్చేందుకు సరిపోతుందని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఇందుకు నిరసనగా బుధవారం సాయంత్రం సత్యమ్మ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అధికారంలో ఉన్న ఐదేళ్లూ చంద్రబాబుతో పాటు మంత్రులు, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, పెత్తందార్లు అందరూ ఆస్తులు కూడబెట్టుకునేందుకే ప్రాధాన్యతనిచ్చారన్నారు. ఇప్పుడు పేదలపై మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. అమరావతి ప్రాంతంలో పేదలకు చోటు ఉండరాదని, కేవలం పెట్టుబడిదారులు మాత్రమే ఉండాలన్నదే చంద్రబాబు ధ్యేయమన్నారు. చంద్రబాబు లాంటి వ్యక్తులు ఉన్నంతకాలమూ పేదలకు న్యాయం జరగదన్నారు. రాజధాని ప్రాంతంలో పేదల కాలనీలు వెలిస్తే వారి మధ్య తాను, తన సహచర టీడీపీ నాయకులు, పెత్తందార్లు విలువ ఉండదనే సంకుచిత భావంతో దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని కుతంత్రాలు చేసినా అమరావతి ప్రాంతంలో పేదలకు సీఎం వైఎస్ జగన్ 50 వేల పక్కా గృహాలను నిర్మించి ఇవ్వడం ఖాయమన్నారు. అనంతరం చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న, ఎంపీపీ రమణారెడ్డి, పుడా చైర్మన్ లక్ష్మీనరసమ్మ, నెడ్‌క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి లోచర్ల విజయభాస్కర్‌రెడ్డి, మెప్మా మహిళా సంఘాల అధ్యక్షురాలు సాయిలీల, కౌన్సిలర్లు సూర్యాగౌడ్, సాయిగీత, చెరువు భాస్కరరెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, వివిధ మండలాల కన్వీనర్లు నరసారెడ్డి, రంగారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాజునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

‘సూపర్’లో అరుదైన శస్త్రచికిత్సలు



శస్త్రచికిత్స చేయించుకున్న వారితో న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్, తదితరులు

అనంతపురం క్రైం: జిల్లా కేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి న్యూరో విభాగం వైద్యులు అరుదైన శస్త్రచికిత్సతో ఇద్దరి ప్రాణాలు కాపాడారు. ఇప్పటి వరకూ కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ. లక్షల వ్యయంతో చేసే శస్త్రచికిత్సలను పూర్తి ఉచితంగా చేయడం గమనార్హం. శస్త్రచికిత్స, ఇతర అంశాలను బుధవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ వెల్లడించారు. సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, న్యూరో సర్జన్లు డాక్టర్ రవితేజ, డాక్టర్ భాస్కర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల విలువ చేసే శస్త్రచికిత్స ఉచితం..

శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం సోమయాజులపల్లికి చెందిన వై.కృష్ణ ఈ నెల 9న నూనె మిల్లులో పనికి వెళ్లిన సమయంలో మూర్ఛ వచ్చి పడిపోయారు. కుటుంబీకులు కదిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అదే రోజు అక్కడి వైద్యులు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి రెఫర్ చేశారు. మూర్ఛరోజుల పాటు స్కానింగ్, ఇతర వైద్య పరీక్షలు చేసి, మెదడులో కణతి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ కేసు ఈ నెల 14న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రెఫర్ అయింది. డాక్టర్ భాస్కర్ వైద్య బృందం ఈ నెల 18న 4 గంటల పాటు శ్రమించి మినిమలీ ఇన్‌వెన్సివ్ మైక్రో ఆపరేషన్ చేసి 5 సెంటీమీటర్ల కణతిని తొలగించారు. ప్రస్తుతం కృష్ణ ఆరోగ్యంగా ఉన్నారు. ఇదే శస్త్రచికిత్స ప్రైవేట్‌గా చేయించాలంటే రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల ఖర్చు అవుతుంది.

పక్షవాతం రాకుండా శస్త్రచికిత్స..

అనంతపురంలోని హమాలీ కాలనీకి చెందిన ఖాసీం వలి మూడేళ్లుగా వెన్నెముక సమస్యతో బాధపడుతున్నాడు. ఈ నెల 1న న్యూరో వైద్యులు పరీక్షించి అదే నెల 12న వెన్నెముక వద్ద చిన్న గాటు చేసి మైక్రోస్కోపిక్, ఎండోస్కోపిక్(మిస్) ద్వారా మినిమలి ఇన్‌వెన్సివ్ మైక్రో ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ తరహా సర్జరీ ప్రైవేట్‌గా చేయించాలంటే రూ.2.5 లక్షలు ఖర్చవుతుంది. తక్కువ సమయం, తక్కువ రక్తస్రావంతో చిన్నగాటుతో శస్త్రచికిత్స చేయడం ద్వారా రోగి త్వరగా కోలుకునే అవకాశముంటుందని డాక్టర్ భాస్కర్ తెలిపారు.

ఇంత పెద్ద ఆస్పత్రిని మునుపెన్నడూ చూడలేదు



నా భర్త కృష్ణకు ఫిట్స్ వచ్చినప్పుడు సర్వజనాస్పత్రిలో చేర్పించాం. మొదట్లో అక్కడి వైద్యులు కర్నూలుకు వెళ్లాల్సి వస్తుందని చెప్పారు. ఆ తర్వాత సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి పంపారు. ఇంత పెద్ద ఆస్పత్రిని మునుపెన్నడూ చూడలేదు. చాలా పెద్దగా ఉంది. ఆస్పత్రి డాక్టర్లు నిజంగా దేవుళ్లే. రూ.లక్షలు విలువ చేసే వైద్యాన్ని ఉచితంగా చేసి నా భర్త ప్రాణాలు కాపాడారు. మాలాంటి పేదలకు ఇంత పెద్ద ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– రామలక్ష్మి, కృష్ణ భార్య, సోమయాజులపల్లి, గాండ్లపెంట మండలం

మూడు దుకాణాల్లో అగ్నిప్రమాదం



అగ్నికి ఆహుతైన మెకానిక్ షాప్

గుంతకల్లు టౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ పోలేరమ్మ గుడి వద్ద వరుసగా ఉన్న మూడు దుకాణాల్లో (రేకుల బంకులు) అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బుధవారం వేకువజామున తొలుత షేక్ మహమ్మద్‌కు చెందిన మెకానిక్ షాప్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. వేస్ట్ ఆయిల్ ఉండడంతో మంటలు వేగంగా వ్యాపించి పక్కనే ఉన్న బట్టల ఇస్త్రీ, బార్బర్ షాపులను తాకాయి. మెకానిక్ షాప్‌లోని ఓ ద్విచక్రవాహనంతో పాటు స్పేర్‌పార్ట్స్, సి.వెంకటేష్‌కు చెందిన బట్టల ఇస్త్రీ బంక్‌లో ఉన్న తోపుడు బండి, పట్టుచీరలు, దుస్తులు, మల్లికార్జునకు చెందిన సెలూన్‌షాప్‌లో ఫర్నీచర్, ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయి. రూ.1.90 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసింది. బాధితులనను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చిన్నబాబు, మైనార్టీ నాయకుడు నూర్ నిజామి పరామర్శించారు.

బదిలీల్లో వ్యాయామ ఉపాధ్యాయులను చేర్చాలి

ప్రశాంతి నిలయం: ప్రస్తుతం చేపట్టిన బదిలీల ప్రక్రియలో ప్రభుత్వ జీఓ 117 మేరకు విధుల్లో చేరిన వ్యాయామ ఉపాధ్యాయులనూ చేర్చాలని డీఈఓ మీనాక్షికి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. బుధవారం కొత్తచెరువులోని డీఈఓ కార్యాలయంలో డీఈఓను కలసిన వారిలో రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షుడు రామకృష్ణ, జిల్లా జనరల్ సెక్రెటరీ వెంకటేష్, ఓబులేసు తదితరులు ఉన్నారు.

కర్నూలు రీజియన్‌కు నలుగురు పోస్టల్ ఎస్పీలు

అనంతపురం సిటీ: కర్నూలు తపాలా శాఖ రీజియన్‌కు నలుగురు సూపరింటెండెంట్లను కేటాయించారు. వీరంతా ఇతర రాష్ట్రాల్లో పని చేస్తుండగా, తాజాగా కర్నూలు రీజియన్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆ శాఖ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. బదిలీ అయిన వారిలో మహారాష్ట్రలోని వివిధ డివిజన్లలో పని చేస్తున్న గుడిమే కిరణ్, బి.లక్ష్మన్న, హరిబాబు వందన, కె.శేషారావు ఉన్నారు. త్వరలో వీరు కర్నూలు పీఎంజీ పోస్టల్ సూపరింటెండెంట్‌లుగా ఖాళీగా ఉన్న రాయలసీమ జిల్లాల్లో నియమితులు కానున్నారు.

రొద్దం సబ్ పోస్టుమాస్టర్‌పై వేటు



సోమందేపల్లిలోని తపాలా శాఖ కార్యాలయం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని తపాలా శాఖలో అక్రమాలు రోజుకొక్కటి చొప్పున వెలుగు చూస్తున్నాయి. తాజాగా రొద్దం సబ్ పోస్ట్‌మాస్టర్ యు.జయప్రకాశ్‌పై సస్పెన్షన్ వేటు పడింది. 2017-19 సంవత్సరాల్లో సోమందేపల్లి సబ్‌పోస్ట్‌మాస్టర్‌గా పని చేసిన కాలంలో ఆయన భారీగా అక్రమాలకు పాల్పడినట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆలస్యంగా గుర్తించిన ఆ శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేయగా రూ.18 లక్షలు స్వాహా చేసినట్లు తేలింది. దీంతో ఇటీవల రూ.4 లక్షలు రికవరీ చేశారు. మిగిలిన రూ.14 లక్షలు రికవరీ కావాల్సి ఉంది. ఈ క్రమంలో అతనిపై సస్పెన్షన్ వేటు వేశారు.

గ్రామాల్లో చిచ్చు పెట్టొద్దు శ్రీరామ్

- డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖరరెడ్డి



మాట్లాడుతున్న తాడిమర్రి చంద్రశేఖరరెడ్డి

తాడిమర్రి: పార్టీ బలోపేతం పేరుతో పచ్చని గ్రామాల్లో చిచ్చు రగల్చడం సరికాదని, ఇప్పటికైనా ఈ విధానాలు విడనాడాలని టీడీపీ నేత పరిటాల శ్రీరామ్‌కు డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖరరెడ్డి హితవు పలికారు. తాడిమర్రిలోని తన స్వగృహంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వారం రోజుల క్రితం పెద్దకోట్లలో వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి మారిన కప్పల గంగయ్య చీనీ తోటలోని బోరు మోటారు ధ్వంసం చేశారంటూ శ్రీరామ్ చేసిన ఆరోపణలను ఖండించారు. గతంలో గంగయ్య బంధువులు తమ చీనీ చెట్లను తామే నరుక్కుని ఇతరులపై ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. అదే తరహాలో గంగయ్య కూడా తన బోరు మోటారును తానే ధ్వంసం చేసుకుని ఉంటాడన్నారు. దీనిపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలో వాస్తవాలు బహిర్గతమవుతాయన్నారు. పార్టీ మారి, వ్యతిరేకంగా చేసిన వారిని కడతేర్చడం పరిటాల కుటుంబానికే చెల్లుతుందన్నారు. ఇలాంటి చర్యలను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఎన్నటికీ ప్రోత్సహించరన్నారు. కేతిరెడ్డి ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ధర్మవరం నియోజకవర్గంలో ప్రజలు వర్గకక్షలు వీడి ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలను ప్రతి ఒక్కరికీ అందజేస్తున్నారన్నారు. ఆస్తుల విధ్వంసానికి తెరలేపి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం శ్రీరామ్ అవివేకానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ఈ వైఖరి వీడాలని, లేకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీపీ పాటిల్ భువనేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జొల్లిరెడ్డి అశ్వత్థు, తాడిమర్రి రమణారెడ్డి, పాటిల్ ప్రకాష్‌రెడ్డి, ఆర్వేటి రామాంజినేయులు, అశ్వత్థరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ నారపరెడ్డి, ఆనందరెడ్డి, సర్పంచులు పుల్లయ్య, వెంకటవరద పాల్గొన్నారు.

మడుగులో పడి విద్యార్థిని మృతి



రోదిస్తున్న కుటుంబసభ్యులు

ఓడీ చెరువు: ప్రమాదవశాత్తు నీటి మడుగులో పడి ఓ విద్యార్థిని మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... ఓడీ చెరువు మండలం పెద్దగుట్లపల్లికి చెందిన రాజాసాహెబ్, మహబూబ్‌బీ దంపతుల కుమార్తె ఆఫ్రీన్ (17)తో కలసి మంగళవారం మిట్టపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చారు. బుధవారం ఉదయం కుటుంబసభ్యులందరూ సరదాగా సోమావతి నది వద్దకు వెళ్లారు. ఆ సమయంలో తోటి పిల్లలతో ఆడుకుంటున్న ఆఫ్రీన్ ప్రమాదవశాత్తు మడుగులో పడింది. పిల్లల ద్వారా ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన అక్కడకు చేరుకుని నీట మునిగిన బాలికను వెలికితీసే లోపు మృతి చెందింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆవు పొట్టలో 15 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు!

- శస్త్రచికిత్స చేసి వెలికి తీసిన 1962 అంబులెన్స్ హెల్ప్‌లైన్ సిబ్బంది



శస్త్రచికిత్స చేస్తున్న ఏడీ డాక్టర్ పద్మనాభం, డాక్టర్లు సునీత, మౌనిక తదితరులు



వెలికి తీసిన ప్లాస్టిక్ వ్యర్థాలు, టీ స్పూన్

అనంతపురం అగ్రికల్చర్: పొట్టలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, స్టీలు స్పూన్ వెలికి తీసి ఓ ఆవు ప్రాణాలను పశుశాఖ అధికారులు, 1962 వైఎస్సార్ వెటర్నరీ అంబులేటరీ డాక్టర్లు కాపాడారు. వివరాలు.. జేఎన్‌టీయూ(ఏ) ఉద్యోగి పవన్‌కుమార్ కొన్ని రోజులుగా తన ఆవు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించి, మంగళవారం 1962 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించారు. దీంతో వైఎస్సార్ సంచార వైద్యశాల వాహనంలో డాక్టర్లు అక్కడు చేరుకుని ఆవును పరిశీలించి, వెంటనే స్థానిక పశువుల ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన పశుసంవర్ధకశాఖ శింగనమల ఆస్పత్రి ఏడీ డాక్టర్ జి.పద్మనాభం.. ఆవు పొట్టలో వ్యర్థాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం కందుకూరు పశువైద్యురాలు డాక్టర్ శ్వేత, 1962 అంబులెన్స్ డాక్టర్లు సునీత, మౌనిక తదితరుల సహకారంతో రెండు గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స చేసి ఆవు పొట్టలో నుంచి 15 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలు, చిన్నపాటి ఇనుపముక్కలు, టీస్పూన్, వాటర్ బాటిల్ మూతలు వెలికి తీశారు. ఆపరేషన్ తర్వాత ఆవును 1962 వాహనంలో సురక్షితంగా యజమాని ఇంటి వద్ద దించివచ్చారు.

సీనియర్ రెసిడెంట్ డాక్టర్ పోస్టుల భర్తీకి చర్యలు

అనంతపురం క్రైం: సీనియర్ రెసిడెంట్ డాక్టర్ పోస్టుల భర్తీకి సంబంధించి అర్హులైన వైద్యుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వివిధ విభాగాలకు సంబంధించి 70 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో స్పెషాలిటీ పోస్టులూ ఉన్నాయి. https://ananthapuramu.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడు చేసుకున్న దరఖాస్తులను భర్తీ చేసి ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు వైద్య కళాశాలలో అందజేయాలి. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 26న కౌన్సిలింగ్ చేపట్టనున్నారు.

బాలిక అదృశ్యం

పెద్దవడుగూరు: మండలంలోని మేడిమాకుపల్లి గ్రామానికి చెందిన బోయ ప్రియాంక మంగళవారం నుంచి కనిపించడం లేదు. బాలిక తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు బుధవారం మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఇంట్లో కుటుంబసభ్యులు ఎవరూ లేని సమయంలో ఆమె ఇల్లు విడిచి వెళ్లినట్లు సమాచారం. బంధువులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో చివరకు పోలీసులను తల్లిదండ్రులు ఆశ్రయించారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96826కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.